నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శనివారం 13 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI




హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

# మోసకారి కాంగ్రెస్‌ను బొంద పెట్టాలి

- వచ్చిన కరువు కన్నా.. కాంగ్రెస్ తెచ్చిన కరువే ఎక్కువ
- పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- జిల్లా మంత్రులు అసమర్థులు
- గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి
- పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నేరేడుచర్ల/ కోదాడ, ఏప్రిల్ 12 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో బొంద పెట్టాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో శుక్రవారం నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎండిపోతున్న పంటలకు నీళ్లిచ్చే అవకాశం ఉన్నప్పటికీ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు అన్నీ మూసుకొని కూర్చొని అసమర్థులుగా మిగిలిపోతున్నారన్నారు. నాడు చంద్రబాబు, వైఎస్ఆర్ హయాంలో ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతుంటే మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఉన్న ప్రస్తుత ఇద్దరు మంత్రులు నోరు మూసుకున్నారని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో ఎండగట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో 420 హామీలిచ్చి, వంద రోజుల్లోనే నెరవేర్చుతామన్న కాంగ్రెస్ పార్టీ 120 రోజులైనా ఏ ఒక్క పథకాన్ని కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్కడా ఎకరం పంట కూడా ఎండిపోలేదని, ఏ ఒక్క రైతూ చనిపోలేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రైతుబంధు అందక చాలా మంది అప్పులపాలయ్యారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏదైనా కారణాలతో రైతు చనిపోయిన 10 రోజుల్లోనే ఆ కుటుంబానికి రైతుబీమా కింద రూ.5లక్షలు అందేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీమా సొమ్ము చెల్లించకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న రెండు వందల రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ధ్వజమెత్తారు. రూ.4వేల పింఛన్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు బంధు పెంపు, మహిళలకు రూ.2500, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఎందుకు చేయలేదో గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు ఉన్న పరిస్థితి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పునరావృతం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రకృతి కరుణించక వచ్చిన కరువు కన్నా కాంగ్రెస్ పార్టీ ముందు చూపు లేని విధానంతో తెచ్చిన కరువే ఎక్కువ అని విమర్శించారు. కేసీఆర్ హయాంలో సాగర్ డ్యామ్‌లో 508 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడు కూడా పంటలకు నీరు అందించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 515 అడుగులకు పైగా నీళ్లు ఉన్నా సాగర్ నీటిని విడుదుల చేయకుండా పంటలను ఎండబెట్టిందని దుయ్యబట్టారు. సాగర్ నీటిని ఖమ్మం జిల్లా పాలేరుకు రెండు సార్లు తరలించుకుపోతుంటే ఇక్కడి మంత్రులు మౌనంగా ఉన్నారని పేర్కొన్నారు. రైతుల్లో ధైర్యం నింపడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎండిన పంటలను పరిశీలిస్తే లాగులు తడిచిన ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలిపోతుందని మొత్తుకున్న ప్రభుత్వం తరువాత నీటిని ఎలా విడుదల చేసిందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అబద్ధాలతో పాలన చేస్తున్న కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి 1200 మంది రైతుల మరణానికి కారణమైన బీజేపీకి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని, బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, భిక్షమయ్యగౌడ్ పాల్గొన్నారు.

### అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి



నేను మధ్య తరగతి రైతు కుటుంబానికి చెందినవాడిని. రైతుల కష్టాలు, బాధలేంటో తెలిసినవాడిని. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నన్ను నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా నిలిపారు. నన్ను గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనను, 110 రోజుల కాంగ్రెస్ పాలనను ప్రజలు కళ్లారా చూశారు. అలవికాని వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ అమలు చేయలేక చేతులెత్తేసింది. రైతులను, మహిళలను, నిరుద్యోగులను ధోకా చేసింది. సాగర్ ఎడమ కాల్వ కింద పంటలు ఎండిపోతుంటే జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండి సాగునీరు అందించకపోవడం దురదృష్టకరం. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2500 ఇవ్వకపోవడం, రైతుబంధులో కోత విధించడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షా 60 వేల ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ సర్కారు ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. కేసీఆర్ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు, మూడు పథకాలు అమలు చేసి చేతులు దులుపుకొంది. మీ సమస్యలను పార్లమెంట్‌లో వినిపించి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. అత్యధిక మెజార్టీ వచ్చేవిధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలి.

**- కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి**

## పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 12 : లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కవరేజ్ నిమిత్తం అథారిటీ లెటర్ల కోసం ఇదివరకే పేర్లు, ఫొటోలు ఇచ్చిన మీడియా ప్రతినిధులు కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ రోజైన మే 13న ఎన్నికల విధుల్లో ఉండి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయలేని వారికి మాత్రమే ఈ సౌకర్యం కల్పించబడుతుందని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునే మీడియా ప్రతినిధులు ఫారం-12డీని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం నుంచి తీసుకోవాలని సూచించారు. 12డీ ఫామ్ నింపి ఓటర్ గుర్తింపు కార్డు జిరాక్స్‌ను జతచేసి ఈ నెల 16లోపు జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యానికి సమ్మతి తెలిపిన తర్వాత రద్దు చేసుకునేందుకు అవకాశం లేదని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాల్సి ఉంటుందని, లేకుంటే ఓటు హక్కును కోల్పోతారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగంలో భాగంగా ఎన్నికల సంఘం కల్పించే ఫెసిలిటేషన్ కేంద్రానికి స్వయంగా వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుందని, పోలింగ్ తేదీకి ముందే ఏర్పాటు చేయబడుతుందని పేర్కొన్నారు.

పూలే, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# గుంపు మేస్త్రీకి గుణపాఠం చెబుదాం

## ఎంపీ సీట్ల కేటాయింపులో బలహీన వర్గాలకు బీఆర్ఎస్ పెద్దపీట

ఇబ్రహీంపట్నం/ ఆదిబట్ల, ఏప్రిల్ 12 : పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గుంపు మేస్త్రీకి గుణపాఠం చెబుదామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం బొంగుళూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీ సీట్ల కేటాయింపులో బీఆర్ఎస్ బలహీన వర్గాల వారికి పెద్ద పీట వేసిందన్నారు. అందులో భాగంగా భువనగిరి స్థానంలో క్యామ మల్లేశ్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆర్థిక ప్రగతితోనే సమానత్వం వస్తుందన్న జ్యోతిరావు పూలే, అంబేద్కర్ ఆశయాలను కేసీఆర్ ఆచరణలో చూపించారన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసినట్లు తెలిపారు. 1008 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించామన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశామని, రూ.11 వేల కోట్లతో గొల్లకురుమలకు సబ్సిడీపై గొర్రెలు, రూ.35 వేల కోట్లతో మత్స్యకారులకు చేప పిల్లలను అందజేశామని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలతో నేతన్నలకు అండగా నిలిచామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉన్నదని, ఒకరిద్దరు అవకాశవాద నేతలు పార్టీని వీడినంతమాత్రాన జరిగే నష్టమేమీలేదని అన్నారు. స్థానికుడైన భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను 50వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి, దండె రాంరెడ్డి, జక్క రాంరెడ్డి, ఎంపీపీ కృపేశ్, జడ్పీటీసీ జంగమ్మ, ఆయా మండలాల అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్



సమావేశానికి హజరైన బీఆర్ఎస్ శ్రేణులు

### ఓట్లు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది

భువనగిరి పార్లమెంటు అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన బీఆర్ఎస్‌కే ఓట్లు అడిగే హక్కు ఉంది. గతంలో ఎంపీగా ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈ ప్రాంత అభివృద్ధికి చేసింది శూన్యం. ఈ నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట ఆలయాన్ని అత్యధిక నిధులతో తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దే. బలహీన వర్గాలకు చెందిన నన్ను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా. అవకాశవాద రాజకీయాలతో పార్టీ మారిన బీజేపీ అభ్యర్థి, మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థికి తగిన గుణపాఠం చెప్పాలి.

**- క్యామ మల్లేశ్, భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి**

# మళ్లీ కడుపు 'కోత'లు

## జిల్లాలో పెరుగుతున్న సిజేరియన్లు

- ఆపరేషన్లతో దందా చేస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్
- 'ప్రైవేట్'లో 70శాతానికిపైగా సిజేరియన్లు
- అవసరం లేకున్నా ఏదో కారణం చెప్పి భయపెడుతున్న మాఫియా
- తల్లి ఆరోగ్యంపై ఎఫెక్ట్.. జనం జేబులు గుల్ల
- నాడు కట్టడికి చర్యలు తీసుకున్న బీఆర్ఎస్ సర్కారు
- నేడు పట్టించుకోని ప్రభుత్వం, జిల్లా అధికారులు

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు కడుపు కోతలకు తెగబడుతున్నాయి. అడ్డగోలు దోపిడీతో మళ్లీ సిజేరియన్లు చేసేస్తున్నాయి. మాఫియాగా మారి డబ్బులకు కక్కుర్తి పడి నార్మల్ డెలివరీలు చేయకుండా ఆపరేషన్లకే మొగ్గు చూపుతున్నాయి. అవసరం లేకున్నా రోగులను భయపెట్టి అందినకాడికి దోచుకుంటున్నాయి. కొన్నిచోట్ల సర్కారు ఆస్పత్రి డాక్టర్లు, స్టాఫ్‌తో కుమ్మక్కై దందా చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో సామాన్య ప్రజల ఆరోగ్యంతోపాటు డబ్బులను కూడా నష్టపోతున్నారు.

– యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ)



### ప్రైవేట్‌లో 70శాతానికి పైగా సీజేరియన్లే..

జిల్లాలో 225 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. దాదాపు అన్నింటిలోనూ సిజేరియన్లు చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఎప్పుడో ఒకసారి నార్మల్ డెలివరీ చేస్తూ.. మిగతా రోజుల్లో సీజేరియన్లు చేస్తున్నారు. మంచి ముహూర్తాల కోసం ఎవరో ఒకరు మాత్రమే సిజేరియన్ చేయించుకుంటుండగా, మిగతా అందరికీ పైసల కోసం అడ్డగోలుగా కోసేస్తున్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ ఏడాది మార్చి వరకు 124 సాధారణ ప్రసవాలు జరుగగా, 421 సిజేరియర్లు చేశారు. ప్రతి పది ప్రసవాల్లో ఏడుగిరికి సిజేరియన్ చేస్తున్నారు. ఇక 2023 సంవత్సరంలో 68శాతం సిజేరియన్లు అయ్యాయి. 8,734 కాన్పులకు 1,100 మాత్రమే సాధారణ ప్రసవాలు జరిగాయి. సాధారణ ప్రసవాలే చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా ఆస్పత్రుల నిర్వాహకులు మాత్రం పట్టించుకోవడంలేదు.

### ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణమే..

ఇక ప్రభుత్వ హాస్పిటల్‌లో మాత్రం సాధారణ ప్రసవాలే జరుగుతున్నాయి. జిల్లాలో మార్చి వరకు గణాంకాలు పరిశీలిస్తే.. 534 సాధారణ ప్రసవాలు చేశారు. ఈ ఏడాది మూడు నెలల్లో 454 సిజేరియన్లు జరిగాయి. అంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ కంటే నార్మల్ డెలివరీలే ఎక్కువగా జరుగుతున్నాయి. సాధారణ ప్రసవాలే జరుగాలని గత బీఆర్ఎస్ సర్కారు కఠిన ఆదేశాలు జారీ చేసింది. అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సైతం ఎప్పటికప్పుడు చర్యలకు ఉపక్రమించారు. ప్రజల్లో అవగాహన క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు కల్పించారు. 24గంటలూ వైద్యులను అందుబాటులో ఉంచారు. నిరంతరం రోగులను పర్యవేక్షించారు. సాధారణ ప్రసవాల బెంచ్‌మార్క్ దాటిన డాక్టర్లు, స్టాఫ్‌కు కూడా ప్రోత్సాహకాలు ప్రకటించారు. కానీ ఇటీవల మళ్లీ సిజేరియన్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది.

### ఆరోగ్యంపై ప్రభావం

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు చేస్తుండటంతో తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. సీజేరియన్ అంటే తప్పకుండా కడుపు కోయక తప్పదు. అది మాని, సాధారణ స్థితికి రావడానికి కనీసం నెల నుంచి రెండు నెలల సమయం పడుతుంది. ట్యాబ్లెట్స్, ఇంజెన్లు వాడాలి. దీని ఎఫెక్ట్ పుట్టిన పాపపై కూడా ఉంటుంది. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. రెండోసారి కాన్పు కూడా ఆపరేషన్ చేస్తే తల్లికి మరింత ఇబ్బంది తప్పదు. అంతేకాకుండా రూ. వేలకు వేలు డబ్బులు ముట్టజెప్పాల్సిందే. సాధారణ ప్రసవాలతో పోలిస్తే సిజేరియన్లకు డబుల్ వసూలు చేస్తారు. సాధారణ ప్రసవానికి రూ. 30వేలు ఉంటే.. సిజేరియన్‌కు రూ. 70వేల దాకా దండుకుంటున్నారు

### స్పెషల్ డ్రైవ్ చేపడుతాం

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో కొద్ది మేర సిజేరియన్లు ఉన్నాయి. వీటిపై దృష్టి పెట్టాం. అలాంటి ఆస్పత్రులపై త్వరలోనే స్పెషల్ డ్రైవ్ చేపడుతాం. విచారణలో తప్పని తేలితే చర్యలు తీసుకుంటాం. గతంలో వరుసగా డ్రైవ్ చేపట్టి, షోకాజ్ నోటీసులు ఇచ్చాం. ఆస్పత్రులను సీజ్ చేశాం. అవసరమైతేనే సిజేరియన్లు చేయాలి. నిబంధనలు కచ్చితగా పాటించాల్సిందే.

**-పాపారావు, డీఎంహెచ్ఓ**

### ఏదో కారణం చెప్పి.. భయపెట్టి..

గతంలో అధిక శాతం నార్మల్ డెలివరీస్ మాత్రమే జరిగేవి. కానీ రానురాను పరిస్థితి మారుతూ వస్తున్నది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల సంఖ్య పెరిగిపోయాయి. డబ్బుల అత్యాశతో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు వికృత బుద్ధిని ప్రదర్శిస్తున్నారు. డెలివరీ సమయంలో ఆస్పత్రికి వస్తే రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. బ్లడ్ తక్కువగా ఉందని, పాప సరిగా లేదని, అడ్డంగా తిరిగారని, సీరియస్‌గా ఉందని చెప్పి భయపెడుతున్నారు. నార్మల్‌కు చాన్స్ లేదని, అలా చేస్తే తల్లీ బిడ్డ ఇద్దరి ప్రాణానికి ప్రమాదమని హెచ్చరిస్తున్నారు. సీజేరియన్ అయితే ప్రమాదం తప్పి బయట పడొచ్చని సలహాలు ఇస్తున్నారు. దాంతో కుటుంబ సభ్యులు సైతం ఆపరేషన్లకు ఓకే చెబుతున్నారు. కాగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీస్ అయినప్పుడు ప్రైవేట్‌లో ఎందుకు అవ్వవని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### సర్కారు డాక్టర్లు, స్టాఫ్ సహకారంతో..!

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు జరుగడానికి డాక్టర్లు, స్టాఫ్, ఆశ కార్యకర్తలే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల చుట్టూ ప్రైవేట్ హాస్పిటల్స్ వెలిశాయి. వీటిల్లో అధిక శాతం ఆస్పత్రుల్లో ఉండే డాక్టర్లే పనిచేస్తున్నారు. కొంత మంది ఏకంగా హాస్పిటల్స్ నడిపిస్తున్నారు. పీహెచ్‌సీల్లో పనిచేస్తే తమకేం లాభమని, రెఫర్ చేస్తే ఎంతో కొంత మిగులుతుందనే భావనలో ఉన్నారు. దాంతో పీహెచ్‌సీలకు వచ్చిన రోగులకు ఏదో ఒక సాకు చెప్పి.. పక్కనే ఉన్న ప్రైవేట్ హాస్పిటల్స్‌కు రెఫర్ చేస్తున్నారు. ఇలా రెఫర్ చేసినందుకు కమీషన్ తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆశ కార్యకర్తలు సైతం ప్రైవేట్ ఆస్పత్రులతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఒక్కో రోగిని రెఫర్ చేసినందుకు రూ. 2వేల నుంచి రూ. 4వేల వరకు కమీషన్ తీసుకుంటున్నారు.

# వర్షంతో ఉలిక్కిపాటు

## కొనుగోలు కేంద్రాల్లో అక్కడక్కడ పాక్షికంగా తడిసిన ధాన్యం

- అకాల వర్షానికి పంటను కాపాడుకునే ప్రయత్నంలో అన్నదాత
- పంట కోయని రైతుల గుండెల్లో అలజడి రేపిన వరుణుడు
- ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనానికి కాస్త ఊరట



ఆలేరు రూరల్ : కొలనుపాకలో తడిసిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతు శ్రీశైలం

### అకాల వర్షానికి తడిసిన ధాన్యం

ఆలేరురూరల్, ఏప్రిల్ 12 : మండలంలోని కొలనుపాక గ్రామంలో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి స్థానిక కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తడిసింది. ఉదయం నుంచి ఎండ ఉండడంతో రైతులు ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. ఒకేసారి వాతావరణం చల్లబడి వర్షం కురియడంతో ధాన్యం తడిసిందని రైతులు వాపోయారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరగా కాంటా వేసి, మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

నల్లగొండ, ఏప్రిల్ 12 : నల్లగొండ జిల్లాలో శుక్రవారం కురిసిన వర్షం అన్నదాతను ఉలిక్కిపడేలా చేసింది. కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన ధాన్యం కాపాడుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇంకా కోత దశలో ఉన్న పంటకు ఎలాంటి నష్టం జరుగుతదోనని ఆందోళన చెందారు. అయితే.. పది రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలతో నిప్పుల కొలిమిలా మారిన నల్లగొండ జిల్లా జనానికి కాస్త ఉపశమనం కలిగిందని చెప్పవచ్చు. జిల్లాలో పది మండలాల్లో పాక్షిక వర్షం కురువడంతో పెద్దగా నష్టం జరుగకపోయినప్పటికీ అక్కడక్కడ పాక్షికంగా ధాన్యం తడిసింది. ఇక ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటి వరకు 63,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. అందులో 738 మెట్రిక్ టన్నులు మినహాయిస్తే మిగిలిన ధాన్యం మిల్లుల్లోకి తరలించడం వల్ల కొన్న వడ్లు పెద్దగా తడవలేదని అధికారులు అంటున్నారు. జిల్లాలో మొత్తం 370 కేంద్రాల్లో కొనుగోలు చేస్తుండగా ఇంకా లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం ఆయా కేంద్రాల్లో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ధాన్యం తడవకుండా అన్నదాతలు ఎంతో ప్రయాస పడాల్సి వచ్చింది.

### అకాల వర్షంతో కాస్త ఉపశమనం

జిల్లాలో పది రోజులుగా 43 నుంచి 45 డిగ్రీల మేరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాంతో ప్రజలు ఈ ఎండ వేడిమికి తాళలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో కూలర్లు కూడా పని చేయని పరిస్థితుల్లో శుక్రవారం పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షం కాస్త ఉపశమనం కలిగించిందని చెప్పవచ్చు. పొద్దున దాకా ఎండతోపాటు ఉక్కపోత ఉన్నప్పటికీ సాయంత్రం పడ్డ వర్షం ఉపశమనం కలిగించింది. పది రోజులుగా సగటున 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, శుక్రవారం 39 డిగ్రీలకు పడిపోయింది.



నల్లగొండలో కురుస్తున్న వర్షం